క్లుప్తంగా

ఎంపీటీసీ భర్త మృతికి ఉప్పాల నివాళి



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి ఎంపీటీసీ మద్దాల రుక్మిణి భర్త నాగేశ్వరరావు ఆదివారం మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీటీసీ రుక్మిణి, కుమారుడు నరేష్‌లకు ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎం. వెంకటరమణ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పాలడగు బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

హనుమంతుని విగ్రహం ఊరేగింపు



పెడన: బందరు మండలం బుద్దాలపాలెం గ్రామంలో హనుమంతుని దేవాలయంలో ప్రతిష్ఠ చేయనున్న హనుమంతుని విగ్రహం ఆదివారం పెడనకు చేరుకుంది. బస్టాండు సమీపంలోని ఆభయాంజనేయస్వామి ఆలయం వద్ద హిందూ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెండ్ల కోటేశ్వరరావు, హిందూ బంధువులు ఊరేగింపుగా వచ్చిన భక్తులను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. పెడన తోటమూల మీదుగా చూజీకంపెనీ పక్క నుంచి బుద్దాలపాలెంకు ఊరేగింపుగా ఈ విగ్రహం చేరుతుందన్నారు. ఈ నెల 28న జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు.

వైభవంగా రేణుక మావురమ్మ అమ్మవారి జాతర



కొత్తపేట(అవనిగడ్డ): మండల పరిధిలోని కొత్తపేటలో వేంచేసియున్న రేణుక మావురమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భూపతి వారి ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మావురమ్మకు గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు, విక్కుర్తి రాంబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, బర్మా బుజ్జితో పాటు పలువురు గ్రామ ప్రముఖులు జాతర మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

ఎయిడ్స్‌పై కళాజాతా



అవనిగడ్డ: ఎయిడ్స్‌వ్యాధిపై కళాకారులు బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో స్థానిక వంతెన సెంటర్‌లో ఆదివారం జరిగిన కళాజాతా కార్యక్రమంలో గుడివాడకు చెందిన కళాకారులు ఎం.శేఖర్‌బాబు మిత్ర బృందం కళాకారులు బుర్రకథ ద్వారా ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, స్థానిక పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన ఉత్సవాలు



పెడన: మండల పరిధిలోని దావోజి పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాలు ఆదివారంతో నాలుగో రోజుకు చేరాయి. 11 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 11 రోజులు పాటు అమ్మవారిని రోజుకొక విధంగా అలంకరించనున్నారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి ప్రతిమను వేకువ జామున ఊరేగించారు. చలినైవేద్యాలను సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

‘లాక్’ వేసేదెలా?

- పూర్తిగా శిథిలమైన లాక్ చాంబర్
- 60,568 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం
- మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నిమ్మగడ్డ లాకుల వద్ద లాక్ చాంబర్ మార్గం (సర్కిల్‌లో పాడైన గేట్లు), ఇన్‌సెట్... నిమ్మగడ్డ లాకుల వద్ద పూర్తిగా పాడైన లాక్ చాంబర్ గేట్లు

చల్లపల్లి: ఖరీఫ్ సీజన్ మరి కొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో సాగునీరు సక్రమంగా అందించేందుకు పాలకులు, అధికారులు ఇప్పటి వరకూ దృష్టిపెట్టలేదు. కృష్ణా జిల్లా, చల్లపల్లి మండం, నిమ్మగడ్డ లాకుల వద్ద పాడైపోయిన గేట్ల పరిస్థితే ఇందుకు నిదర్శనం.

విషయం ఇదీ..

ప్రకాశం బ్యారేజి నుంచి అవనిగడ్డ వరకూ లక్షలాది ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు సుమారు 67 కిలోమీటర్లు పొడవున కేఈబీ (కృష్ణా ఈస్టర్ బ్యాంక్) కెనాల్‌పై నీటి ప్రవాహాన్ని అదుపు చేసి పంట పొలాలకు అందించేందుకు యనమలకుదురు, వల్లూరుపాలెం, గుర్విందపల్లి, నిమ్మగడ్డ నాలుగు ప్రాంతాల్లో లాకులను ఏర్పాటు చేశారు. నీటి నిర్వహణను నియంత్రించే పరిస్థితి లేకుండా పోయింది.

సమస్య ఇదీ..

ప్రస్తుతం వల్లూరుపాలెం, నిమ్మగడ్డ ప్రాంతాల్లోని లాకులు పాడయ్యాయి. నిమ్మగడ్డ వద్ద ఉన్న లాక్ చాంబర్ పూర్తిగా పాడవటంతో అక్కడ చుక్క నీటిని కూడా నియంత్రించలేని దుస్థితి నెలకొంది. కేఈబీ కెనాల్‌లో లాకుల వద్ద నిర్ణీత ఎత్తు మేర నీటి పరిమాణం పెరిగినప్పుడే అనుసంధానంగా ఉన్న పంట కాలువల్లోకి సాగునీరు వెళ్లి అక్కడ నుంచి పంట పొలాలకు చేరుతుంది. లాక్ చాంబర్ పాడైపోయిన కారణంగా కేఈబీ కెనాల్లో ఎగువ నుంచి వచ్చే నీరు వచ్చింది వచ్చినట్లు దిగువకు వెళ్లిపోయే ప్రమాదం నెలకొంది. దీంతో చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాలకు అందాల్సిన సాగునీటి పంపిణీపై నియంత్రణ లేకుండా పోతోంది.

ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో..

ఈ కేఈబీ కెనాల్ ద్వారా శ్రీకాకుళం ఇరిగేషన్ సెక్షన్ కింద ఉన్న ఘంటసాల మండలం, చల్లపల్లి మండలంలో కొన్ని గ్రామాలకు ఆగాకోడు, 1వ, 2, 3, 4, 5వ నంబర్ పంటకాలవలు, వాటికి అనుసంధానంగా ఉన్న ఉప పంట కాలువల ద్వారా 26,992 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. చల్లపల్లి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని 6వ, 7, 8, 9/1, 9/2వ నంబర్ కాలువల కింద ఉన్న చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురు, పురిటిగడ్డ, పాగోలు, చల్లపల్లి, మంగళాపురం, లక్ష్మీపురం, మాజేరు గ్రామాలకు చెందిన 7,036 ఎకరాలకు సాగునీరు వెళ్లాలి. వీటిలో 6వ నంబర్ కాలువ ద్వారా 2,723 ఎకరాలకు, 9/2 కాలువ ద్వారా 2,228 ఎకరాలకు సాగునీరు ఈ కేఈబీ కెనాల్ ద్వారానే వెళుతుంది.

మోపిదేవి, బందరు మండలాల్లో..

మొపిదేవి మండలం కె.కొత్తపాలెం వద్ద ఉన్న 9వ నంబర్ కాలువ ద్వారా కె.కొత్తపాలెం నుంచి మంగళాపురం, మాజేరు మీదుగా బందరు మండలం భోగిరెడ్డిపల్లి, భవానీపురం వరకూ 28.8 కిలోమీటర్ల పొడవున్న ఈ 9వ నంబర్ కాలువ కింద 26,540 ఎకరాలు సాగు విస్తీర్ణం ఉంది. కేఈబీ కెనాల్లో పూర్తిస్థాయిలో నీటి మట్టం ఉన్నప్పుడు మాత్రమే ఈ కాలవల్లోకి సాగునీటిని తరలించే అవకాశం ఉంది. తగినంత నీటి మట్టం లేనపుడు ఈ కాలువల్లోకి నీరు పోయే పరిస్థితి లేదు. కేఈబీ కెనాల్‌లో నిమ్మగడ్డ వద్ద లాక్ చాంబర్ పూర్తిగా పాడైపోవటం వల్ల కేఈబీ కెనాల్లో తగినంత నీటి మట్టాన్ని నిలుపుదల చేసే అవకాశం లేకపోవటం వల్ల నీరంతా దిగువకు పోయే పరిస్థితి ఏర్పడింది.

అధికారులు స్పందిస్తే మేలు..

యుద్ధప్రాతిపదికన నిమ్మగడ్డ లాక్ చాంబర్‌కు మరమ్మతులు చేపట్టకపోతే నీరు అందని కారణంగా సుమారు 60,568 ఎకరాల్లో ఖరీఫ్‌కు సాగు అస్తవ్యస్తం అవుతుంది. అధికారులు స్పందించి పాడైపోయిన లాక్ చాంబర్‌కు మరమ్మతులు చేసి ఎగువ నుంచి దిగువ వరకూ ప్రతి ఎకరాకు సాగు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లాక్ చాంబర్ అంటే..



కేఈబీ కెనాల్‌పై లాకులు అన్ని బ్రిటీష్ కాలంలో కట్టినవి కావటంతో లాకుల నిర్మాణాన్ని రెండు రకాలుగా నిర్మించారు. ఒకటి వీవర్ లాకులు వీటి ద్వారా సాగునీరు అవసరాన్ని బట్టి నిలుపుదల చేయటం, దిగువకు వదలటం చేస్తుంటారు. దీనికి అనుబంధంగా పక్కనే లాక్ చాంబర్లను కూడా నిర్మించారు. అప్పట్లో బ్రిటీష్‌వారు ఈ కేఈబీ కెనాల్‌లో పడవల్లో ప్రయాణం చేసి దిగువన ఉన్న దివిసీమ ప్రాంతానికి వచ్చేవారు. ఇలా వచ్చిన పడవలను లాకులను దాటించి ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రత్యేకంగా నిర్మించినదే ఈ లాక్ చాంబర్. ఈ లాక్ చాంబర్ మార్గంలో రెండు చోట్ల గేట్లు ఏర్పాటు చేశారు. రెండు గేట్లకు మధ్యన పడవలు నిలిచేంత ప్రదేశం ఉంటుంది దానిని చాంబర్ అంటారు. సాగు నీటి నియంత్రణ, పడవల రాకపోకలకు అనువైన వ్యవస్థ ఇది.

లాకులకు త్వరలో మరమ్మతులు చేపడతాం

నిమ్మగడ్డ, వల్లూరు పాలెం లాకుల మరమ్మతులకు అంచనాలు తయారుచేసి పంపించాం. రెండింటికీ కలిపి రూ.24 లక్షల మేర పనులకు ఆమోదం లభించింది. త్వరలో పనులు ప్రారంభించి మరమ్మతులు పూర్తిచేస్తాం.
– టి.ప్రసాద్, ఏఈ, ఇరిగేషన్, శ్రీకాకుళం సెక్షన్

ఎడ్లంక కాజ్‌వే గండ్లు స్వచ్ఛందంగా పూడ్చివేత



ఎడ్లంక(అవనిగడ్డ): మండల పరిధిలోని ఎడ్లంకకు వెళ్లే కాజ్‌వే రహదారికి ఇటీవలె కురిసిన వర్షాలకు గండ్లు పడ్డాయి. కాజ్‌వే రహదారిపై వాహనాలు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో గ్రామానికి చెందిన దోవా గోవర్ధన్, నలిగిలి బాబూరావు స్పందించి స్వచ్ఛందంగా జేసీబీతో గండ్లు పూడ్చించారు. గతంలో ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారని గోవర్ధన్ గుర్తు చేశారు. ఏడాది పాలన పూర్తయినా ఇంతవరకూ ఎడ్లంక వంతెన ఊసేలేదని విమర్శించారు. కొద్దిపాటి వర్షానికి కాజ్‌వే రహదారి గండ్లు పడటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎండల సమయంలో బుసక వల్ల ద్విచక్ర వాహనాలు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పాలకులు స్పందించి ఎడ్లంకకు వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

కృత్తివెన్ను: మండలంలోని గాంధీనగరం గ్రామంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు ఐదవరోజుకు చేరుకున్నాయి. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, దైవిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మోపిదేవి మండలం కోసూరివారిపాలెం, మల్లయ్య చిట్టూర్పు గ్రామాలకు చెందిన మహిళలు చేసిన హనుమాన్‌చాలీసా పారాయణం ఆకట్టుకుంది. బృంద గురువు కనకదుర్గతో పాటు సభ్యులను కమిటీ వారు సత్కరించారు. సోమవారం ఉదయం నుంచి అఖండ అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు వివరించారు.


సామాన్యుడికి చేరువలో బ్యాంక్ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి

మచిలీపట్నంటౌన్: విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పలు రకాల సేవలను అందిస్తూ సామాన్యుడికి చేరువలో ఉందని బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం బ్యాంక్ సభ్యుల మహాసభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు సామాన్యులకు అందుబాటులో ఉంటూ రుణాలు అందజేయటంలో ముందుంటోందన్నారు. పలు రకాల రుణాలు మంజూరు చేయటంతో బ్యాంకు సాధారణ ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తోందన్నారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు విద్యరుణాలు అందజేస్తున్నామన్నారు. సన్న, చిన్నకారు రైతులు, చిరువ్యాపారులకు తమ బ్యాంకు రుణాలు ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తోందన్నారు. బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికి 55 బ్రాంచ్‌ల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సభ అనంతరం సభ్యులు మాదాసు వేణుగోపాలరావు, వీరంకి నాగబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ నన్నపనేని జంగయ్య, డెప్యూటీ సీఈవో ఎంవీ గణేష్, విజయవాడ జోనల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, జోనల్ మేనేజర్ వి.సీతారాం, పాట్లూరి వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష మల్లెలార్చన



శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారు

చల్లపల్లి: మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నడకుదురులో శ్రీపృథ్వీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా శ్రీబాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి లక్ష మల్లెలార్చన కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు కంఠంరాజు గణపతి దీక్షితులు (సాయిబాబు శర్మ) పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, గోత్రనామ సంకల్పం, స్వామివారికి రుద్రాక్ష పూజ, ధూప, దీప. మహా నివేదన, నీరాజన మంత్ర పుష్పములు సమర్పణ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారికి మహా స్నపన, ప్రత్యేక అలంకారం చేశారు. శ్రీలలితా సహస్రనామ పారాయణం అనంతరం మల్లె పుష్పార్చన, కుంకుమార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం 200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను గ్రామ ప్రముఖులు నాదేళ్ళ త్రివిక్రమరావు, విశ్రాంత ఆర్టీవో నాదేళ్ళ శివరామకృష్ణలు పర్యవేక్షించారు.

ఘనంగా నీలారమ్మ వారి వార్షిక సంబరం



కమిటీ సభ్యులు, పెద్దలతో వైఎస్సార్ సీపీ నేత శ్రీరాములు- శివపార్వతి దంపతులు

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామ శివారు సూరపనేనిపాలెంలో వేంచేసియున్న నీలారమ్మ అమ్మ వారి 15వ వార్షిక సంబరం వైఎస్సార్ సీపీ నేత తమ్మనబోయిన శ్రీరాములు-శివపార్వతి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీరాములు-శివ పార్వతి, ఆత్మకూరి జయ కిషోర్- వీర నాగభవాని దంపతులు, తమ్మనబోయిన నీలిమ రాణి, తన్విశ్రీ, స్నిగ్ధశ్రీ, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. మొక్కుబడులను తీర్చుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీనీలారమ్మ అమ్మ వారిని డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం చేశారు. 20 మంది ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలను శ్రీరాముల దంపతులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. 500 మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులను నగదు బహుమతులతో సత్కరించిన దృశ్యం

మచిలీపట్నంటౌన్: విద్యతోనే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని కాకినాడ జిల్లా డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు అన్నారు. పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూటీఎఫ్ హాలులో ప్రతిభ పురస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన తొమ్మిది మంది పద్మశాలి విద్యార్థులకు రూ.27 వేల నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులకు శాలువా కప్పి మెమెంటో అందజేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ద్వారానే ప్రతి ఒక్కరూ ఉన్నత ఉద్యోగాలు సాధించగలుగుతారన్నారు. అప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ దంత వైద్యులు డి. శ్యామ్‌కుమార్, అంకాలజిస్ట్ పీవీ నరసింహారావు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, రాష్ట్ర కోశాధికారి టి.చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం మాజీ జాయింట్ సెక్రటరీ విట్టంశెట్టి వెంకు మాస్టర్ తదితరులు హాజరయ్యారు. అతిథులను ఘనంగా సత్కరించారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ నిలిపివేత అన్యాయం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీసెల్ జాయింట్ సెక్రటరీ రంగారావు

నాగాయలంక: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అవినీతికి పరాకాష్ఠగా వ్యవహరిస్తూ, పేద ప్రజలకు మేలు చేసే పథకాలను నిలిపివేసి తీవ్ర అన్యాయం చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద బీసీ, ఎస్సీ, ఈబీసీ వర్గాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం అందజేస్తే ప్రజలు ఎంతగానో సంతోషించారన్నారు. అలాంటి పథకాన్ని కూటమి ప్రభుత్వం వచ్చేనెల ఒకటో తేదీ నుంచి రద్దు చేయాలని పూనుకోవడం కూటమి నేతల దుర్బుద్ధికి నిదర్శనమని రంగారావు విమర్శించారు. అప్పటి ముఖ్యమంత్రి జగనన్న ఆలోచనలకు ప్రజలు సర్వత్రా మద్దతు పలికారన్న అక్కసుతోనే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 9,260 ఎండీయూ వాహనాలను నిలిపివేశారన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఎండీయూ వాహనాలతో రేషన్ పంపిణీ యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సింగిల్ నంబర్ లాటరీ ఆడుతున్న వ్యక్తి అరెస్ట్

చల్లపల్లి: సింగిల్ నంబర్ లాటరీ ఆడుతున్న ఓ వ్యక్తిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. విజయవాడ రోడ్డులోని విజయా కాన్వెంట్ వద్ద లాటరీ ఆట ఆడుతున్నట్లు సమాచారం అందుకుని గంజాల వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తోట్లవల్లూరు: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాలలో 1996-97వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఇరవై ఎనిమిదేళ్ల తరువాత కలిసిన తమ సహచర మిత్రులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

గురువులకు సత్కారం..

ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, నరేంద్ర, సంధ్యారాణి, విఠల్‌పాల్, సురేష్, బీ. శ్రీనివాసరావు, ఎం. చంద్రశేఖర్, ఈడ్పుగంటి శామ్యూల్‌ను సన్మానించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆనందోత్సాహంగా గడిపారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల కోలాహలం



నాగపుట్టలో పాలుపోస్తున్న భక్తులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. తెల్లవారు జామునుంచే క్యూలైనులన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రధాన రహదారే పార్కింగ్

మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దర్శనార్థం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తుల వాహనాల పార్కింగ్ ప్రదేశం చాలకపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తుల వాహనా లను దృష్టిలో పెట్టుకుని తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

స్నేహితుడికి అండగా పూర్వ విద్యార్థులు



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చల్లపల్లి: చల్లపల్లి శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహదూర్ (ఎస్ఆర్‌వైఎస్‌పీ) కళాశాలలో 1997- 98 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆపదలో ఉన్న తమ స్నేహితునికి మేమున్నామంటూ అండగా నిలబడ్డారు. తమతో పాటు చదువుకున్న కిషోర్ రెండు సంవత్సరాల క్రితం ప్రమాదానికి గురవటంతో కాలు విరిగింది. అయితే ఆర్థికలేమి కారణంగా మందులు సక్రమంగా వాడుకోలేకపోవటంతో ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ప్రస్తుతం పనికి కూడా వెళ్లలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న కిషోర్ స్నేహితులు మేమున్నామంటూ సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. అందరూ కలిసి సమకూర్చిన రూ.41 వేల నగదును ఆదివారం కిషోర్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. నగదును అందజేసిన వారిలో వెనిగళ్ల తారక జగదీష్, పులి బాబ్జి, గంజాల శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, ఖాజాబాబు, కిషోర్ ఉన్నారు.

మోపిదేవి నుంచి పెదకళ్లేపల్లికి ఉచిత బస్సు సౌకర్యం



భక్తులతో బయలు దేరిన ఉచిత బస్సు

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనార్థం విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం రెండు ట్రిప్పులు దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లికి ఉచితంగా బస్సు ఏర్పాటు చేసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఉదయం మోపిదేవి నుంచి పెదకళ్లేపల్లికి ఉచిత బస్సును ఆలయ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ దేవస్థానం తరపున చల్లపల్లి ఎస్టేట్ పరిధిలోని పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానానికి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో అక్కడకు వచ్చిన భక్తులకు ఉచిత అన్న ప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్షం నీరు తొలగింపునకు చర్యలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీలో రోడ్లపై నిలిచిన ముంపునీరు తొలగింపునకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలనీలోని అంతర్గత రోడ్లు వర్షం నీటిలో చిక్కుకున్నాయి. దీంతో కాలనీవాసులు కొన్ని రోజులుగా వర్షం నీటిలో రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. దీంతో మురుగునీటి తొలగింపునకు సర్పంచ్ పెనుమత్స రాధిక చర్యలు చేపట్టారు. కూలీలను ఏర్పాటు చేసి వర్షం నీరు నిలువ ఉన్న రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్ల పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. డ్రెయిన్ల పూడికతీతతో రోడ్లపై నిలిచిన నీరు బయటకు తరలివెళుతోంది. పనులను పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

గ్రంథాలయ అధికారి ప్రభుదాస్ మృతి



అవనిగడ్డ: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న జుజ్జువరపు ప్రభుదాస్ (49) అనారోగ్యంతో ఆదివారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుదాస్ చిత్రపటానికి పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావుతో పాటు పలువురు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేవారికి ఎంతో సహకారం అందించారని పోస్టుమాస్టర్ రామలింగేశ్వరరావు కొనియాడారు.

పేకాట శిబిరంపై దాడి

చినముత్తేవి(మొవ్వ): చినముత్తేవి పొలాల్లో సాగుతున్న పేకాట శిబిరంపై కూచిపూడి ఎస్ఐ కేఎన్ విశ్వనాథ్ తన సిబ్బందితో ఆదివారం దాడి నిర్వహించారు. పామర్రు సీఐ వి.సుభాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులు డబ్బులు పెట్టి పేకాట ఆడుతుండగా వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.35,200లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com